

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



మంగళవారం 17-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :148 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

డిస్కంల్లో డిజిటల్ విప్లవం!

- ఉద్యోగులకు కొత్త టెక్నాలజీ శిక్షణ
- విద్యుత్ సంస్థల్లో ప్రత్యేక డిజిటల్ విభాగం
- కొత్త పోస్టుల భర్తీకి కేంద్రం సూచన
- ఏఐ, సైబర్ నిపుణులకు డిమాండ్
- లైన్‌మెన్ల భద్రతకు ఆధునిక శిక్షణ
- వీఆర్, ఏఆర్ టెక్నాలజీతో శిక్షణ
- మూడేళ్లలో డిస్కంల రూపురేఖలు మార్పు
- ఆరు నెలల్లో డిజిటల్ శిక్షణ పూర్తి



న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరును సమూలంగా మార్చేందుకు సిద్ధమవుతున్న కేంద్ర విద్యుత్ శాఖ.. సంస్థల్లోని ఉద్యోగుల విభాగాల్లోనూ భారీ ప్రక్షాళనకు తెరలేపింది. కేవలం పాత పద్ధతుల్లో బిల్లింగ్, మెయింటెనెన్స్ నిర్వహించే సంప్రదాయ ఐటీ విభాగాలు ఇకపై ఏమాత్రం సరిపోవని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ తేల్చిచెప్పింది. ఇందుకోసం డిస్కంలలో ప్రత్యేకంగా 'డిజిటల్ కేడర్' ఏర్పాటు చేయాలని, ప్రస్తుత ఉద్యోగులకు నూతన సాంకేతికతపై యుద్ధప్రాతిపదికన శిక్షణ ఇవ్వాలని తాజాగా విడుదల చేసిన 'యూనిఫైడ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ డిజిటలైజేషన్ ఆఫ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్' నివేదికలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసింది.

కుల్గాం దాడి సూత్రధారి హతం!

- ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి
- లతీఫ్ భట్‌ను మట్టుబెట్టిన బలగాలు
- ఆరు రోజుల వేటకు తెర
- సీఆర్పీఎఫ్ క్యాంపు దాడికి ప్రతీకారం
- 600 మందికి పైగా అనుమానితుల విచారణ
- డ్రోన్లతో ఉగ్రవాదుల కోసం గాలింపు
- లష్కరే ఉగ్రవాదికి భద్రతా బలగాల చెక్
- కుల్గాంలో భద్రతా బలగాల ఆపరేషన్ విజయవంతం

2 లో

ఘనంగా ముగిసిన ఛఠ్ పూజ!

- దేశవ్యాప్తంగా ఘనంగా ఛఠ్ పూజ
- ఉదయించే సూర్యుడికి భక్తుల అర్ఘ్యం
- నదీ తీరాల్లో భక్తుల సందడి
- 36 గంటల ఉపవాస దీక్ష విరమణ
- సూర్యభగవానుడికి ప్రత్యేక ప్రార్థనలు
- ఛఠ్ పూజకు ప్రభుత్వాల ప్రత్యేక ఏర్పాట్లు

2 లో

హైకోర్టులో కౌశిక్‌కు ఎదురుదెబ్బ!



న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ హైకోర్టులో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది.వాయిస్ శాంపిల్ ఇవ్వాలంటూ పోలీసులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. వివరాల్లోకి వెళితే..



తెలంగాణలో పింఛన్ల పండుగ!

- తెలంగాణలో 4.63 లక్షల మందికి కొత్త పింఛన్లు
- ఈ నెల 19న ఖాతాల్లోకి పింఛన్ నగదు
- వితంతువులకే అత్యధికంగా పింఛన్ల మంజూరు
- ఐదు కేటగిరీల్లో కొత్త లబ్ధిదారుల ఎంపిక
- ఇందిరాగాంధీ జయంతి రోజున పింఛన్ కానుక
- నవంబర్ 18లోగా మంజూరు పత్రాల పంపిణీ
- రాష్ట్రంలో 45 లక్షలకు చేరనున్న పింఛన్ లబ్ధిదారులు
- దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా
- పింఛన్ నగదుకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4,63,857 మందికి పింఛన్లు మంజూరు చేసింది. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి తొలి నెల పింఛన్ నగదును నేరుగా జమ చేయనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. కొత్తగా ఎంపికైన వారిలో అత్యధికంగా వితంతువులు ఉండటం గమనార్హం.

మిగతాది 2 లో..

సర్ పై సుప్రీంకోర్టుకు రాహుల్!

- ఈసీకి 48 ప్రశ్నలతో పిటిషన్
- ఓటర్ల తొలగింపుపై రాహుల్ అభ్యంతరం
- ఈసీ నిర్ణయాలపై విపక్షాల ప్రశ్నలు
- ఎన్నికల కమిషనర్ల అఫిడవిట్లకు డిమాండ్
- ఓట్ల తొలగింపుపై వివరాలు కోరిన విపక్షాలు
- ఈసీ అధికారాల వినియోగంపై సందేహాలు
- ఓటర్ల జాబితా సవరణపై న్యాయపోరాటం
- కీలక రికార్డులు బయటపెట్టాలని పిటిషన్



న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, అలాగే భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై భారత ఎన్నికల సంఘానికి 48 అధికారిక లిఖితపూర్వక ప్రశ్నలు పంపేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వారు పిటిషన్ దాఖలు చేశారు. అందుకు సంబంధించి ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి అఫిడవిట్లు దాఖలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

తెలంగాణకు అక్వాన్ అలర్ట్!



- 9 జిల్లాలకు భారీ వర్ష సూచన
- 200 మి.మీ.కు పైగా వర్షాలు?
- హైదరాబాద్‌కు వర్ష హెచ్చరిక
- ఖమ్మం నుంచి వరంగల్ వరకు అలర్ట్
- 20 నుంచి 22 వరకు తుఫాన్ ప్రభావం

ఎల్పీజీ వాడకంలో తెలంగాణ నంబర్ వన్!

- 95.3 శాతం కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు
- దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ
- పట్టణాల కంటే గ్రామాల్లోనే అధిక వినియోగం
- ఎల్పీజీ వినియోగంలో ఏపీకి రెండో స్థానం
- 1.3 కోట్ల మంది యాక్టివ్ వినియోగదారులు
- ప్రభుత్వ పథకాలతో పెరిగిన గ్యాస్ వినియోగం
- గ్రామీణ కుటుంబాలకు వంట గ్యాస్ భరోసా



న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ మరోసారి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించింది. గ్రామీణ ప్రాంతాల్లో వంట గ్యాస్ (ఎల్పీజీ) వినియోగంలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. గ్రామీణ తెలంగాణలో ఏకంగా 95.3 శాతం కుటుంబాలు వంటకు ఎల్పీజీనే ప్రధాన ఇంధనంగా ఉపయోగిస్తున్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది. 'ఇండియాస్ కన్సంప్షన్ జర్నీ' పేరుతో విడుదల చేసిన ఈ నివేదికలో దేశవ్యాప్తంగా గృహాల వినియోగ సరళిని విశ్లేషించారు. ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో 95.3 శాతం కుటుంబాలు వంట గ్యాస్‌ను ప్రధాన ఇంధనంగా వినియోగిస్తున్నాయి.

టెన్త్ పరీక్షల ఫీజు డేట్స్ మార్పు!



- నవంబర్ 26 వరకు ఫీజు గడువు
- ఆలస్య రుసుముతో కొత్త షెడ్యూల్
- రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 8 వరకు
- రూ.200 ఫైన్‌తో డిసెంబర్ 21 వరకు ఛాన్స్
- రూ.500 ఫైన్‌తో జనవరి 4 వరకు గడువు
- మళ్లీ గడువు పొడిగించబోమని స్పష్టం

2 లో

ఓటర్లకు ఈసీ భారీ ఊరట!

- పేర్లు తొలగినా మళ్లీ ఓటు హక్కు
- ఫారం-6పై క్రిమినల్ చర్యలు ఉండవు
- ఓటర్లకు మరో అవకాశం కల్పించిన ఈసీ
- తప్పుడు ప్రకటనగా పరిగణించబోమని స్పష్టత
- ఏడు రాష్ట్రాలకు ఈసీ కీలక ఆదేశాలు
- స్థానిక భాషల్లో ప్రచారం చేయాలని సూచన
- తుది జాబితాలో పేర్ల నమోదుకు ఛాన్స్



న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా పేర్లు తొలగించబడిన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం కీలక ఊరటనిచ్చింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లు గల్లంతైన పాత ఓటర్లు, తిరిగి తమ పేర్లను చేర్చుకునేందుకు 'ఫారం-6'సమర్పించినంత మాత్రాన వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 కింద ఎలాంటి ప్రాసిక్యూషన్ (క్రిమినల్ చర్యలు) ఉండదని ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు రాకేశ్ కుమార్ సింగ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై నవంబర్ 14న డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ భాను ప్రకాశ్ ఏటూరు సుప్రీంకోర్టులో అనుబంధ అఫిడవిట్ దాఖలు చేశారు.

ఈ కేసు విచారణ సందర్భంగా ఈసీ స్పందిస్తూ.. గతంలో ఓటరుగా నమోదై ఉండి, ముసాయిదా జాబితాలో పేరు లేని కారణంగా ఫారం-6 దాఖలు చేస్తే, అది తప్పుడు డిక్లరేషన్ ఇచ్చినట్లు అవుతుందేమోనని, శిక్షార్హమవుతుందేమోనని ఓటర్లలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీనిపై నవంబర్ 3నే స్పష్టత ఇచ్చినట్లు ఈసీ పేర్కొంది. సదరు ఓటరు మరొక పార్లమెంట్ లేదా అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండకపోతే, ఫారం-6 దాఖలు చేయడం చట్టబద్ధమేనని, దానిని తప్పుడు ప్రకటనగా పరిగణించబోమని ఈసీ తేల్చి చెప్పింది.

అలాగే అక్టోబర్ 14, 2026న 'నిలోత్పల్ దత్తా వర్సెస్ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా' కేసులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఈసీ ప్రస్తావించింది.

'ఓట్ చోర్' నినాదం.. ఇటలీ నేతకు షాక్!

- ఇటలీ నేత వ్యాఖ్యలతో రాజకీయ దుమారం
- భారత్‌లోనూ వీసా నిబంధనల ఉల్లంఘన?
- 'ఓట్ చోర్' నినాదంతో వివాదం
- 2018లోనే ఫిలిప్పీన్స్ బ్లాక్‌లిస్ట్
- విదేశీ నేత వ్యాఖ్యలపై బీజేపీ అభ్యంతరం
- ఫిలిబెక్‌ను వెనక్కి పంపిన ఫిలిప్పీన్స్
- కాన్ఫరెన్స్ వీసాతో రాజకీయ వ్యాఖ్యలా?

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 17-11-2026

హైకోర్టులో కౌశిక్‌కు ఎదురుదెబ్బ!

మొదటి పేజీ తరువాయి

గతంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను దూషించారన్న ఫిర్యాదు మేరకు వీణవంక పోలీస్ స్టేషన్‌లో పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా, ఆడియో ఆధారాలను ధృవీకరించుకునేందుకు వాయిస్ శాంపిల్ (గొంతు నమూనా) ఇవ్వాలని పోలీసులు కౌశిక్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు.

హైకోర్టు ఏం చెప్పిందంటే?

పోలీసుల నోటీసులను సవాల్ చేస్తూ కౌశిక్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. నేర దర్యాప్తులో భాగంగా పోలీసులు వాయిస్ శాంపిల్స్ సేకరించడం సహజమేనని, చట్టప్రకారం సాగే ఆ ప్రక్రియను తప్పుబట్టలేమని స్పష్టం చేసింది. అనంతరం ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు, కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు తాజా నిర్ణయంతో కౌశిక్ రెడ్డి పోలీసుల విచారణకు సహకరించి, వాయిస్ శాంపిల్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తెలంగాణకు అక్వాన్ అలర్ట్!

న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అక్వాన్ తుపాను'గా బలపడుతున్న నేపథ్యంలో తెలంగాణకు వాతావరణ నిపుణులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. నవంబర్ 20న ఆంధ్రప్రదేశ్ తీరాన్ని (నెల్లూరు - తుని మధ్య, ప్రధానంగా కావలి - కోనసీమ మధ్య ఒంగోలు/బాపట్ల సమీపంలో) ఈ తుపాను తీరం దాటే అవకాశం ఉన్నందున, నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణపై దీని ప్రభావం తీవ్రంగా ఉండనున్నట్లు వెదర్ మ్యాన్ అంచనా వేశారు. కాగా ఈ తుపాను ప్రభావంతో తూర్పు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ముఖ్యంగా నవంబర్ 21న దీని తీవ్రత గరిష్టంగా ఉండనుండగా, కొన్ని ప్రాంతాల్లో 150 మి.మీ నుంచి 200 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో నవంబర్ 21, 22 తేదీల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు (ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం) కురిసే అవకాశం ఉంది. అలాగే పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో తుపాను ప్రభావం తక్కువగా ఉంటుందని, అక్కడ కేవలం తేలికపాటి వర్షాలు లేదా పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తుపాను గమనంలో ఏవైనా మార్పులు ఉంటే నవంబర్ 19 లేదా 20వ తేదీల్లో తాజా మ్యాప్ అంచనాలను విడుదల చేస్తామని, లేనిపక్షంలో ఇదే అంచనా కొనసాగుతుందని వాతావరణ నిపుణులు వెదర్ మ్యాన్ స్పష్టం చేశారు.

టెన్త్ పరీక్షల ఫీజు డేట్స్ మార్పు!

న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో 2027 మార్చిలో జరగనున్న పదో తరగతి ఫైనల్ పరీక్షల ఫీజు చెల్లింపు తేదీలను అధికారులు సవరించారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సోమవారం కొత్త తేదీలను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు గతంలో పరీక్షల్లో తప్పిన విద్యార్థులు సైబర్ ట్రెజరీ ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు తేదీలను ప్రకటించారు. అన్ని సబ్జెక్టులకు రూ. 125, మూడు సబ్జెక్టుల వరకు హాజరయ్యే విద్యార్థులకు రూ. 110 ఫీజుగా నిర్ణయించారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు పరీక్ష రాసే విద్యార్థులు రూ. 125 చెల్లించాల్సి ఉంటుంది. వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులు రెగ్యులర్ పరీక్ష ఫీజు రూ. 125తో పాటు అదనంగా రూ. 60 చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పరీక్ష ఫీజు చెల్లింపు గడువులను ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ పొడిగించబోమని స్పష్టం చేసింది. అధికారిక వెబ్‌సైట్ www.bse.telangana.gov.in ద్వారా స్కూల్ లాగిన్‌లో మాత్రమే సైబర్ ట్రెజరీ అనుసంధానంతో ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలని సూచించింది. IFMIS పోర్టల్ చలాన్లు లేదా మాన్యువల్ బ్యాంక్ చలాన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అధికారులు తేల్చిచెప్పారు.

సవరించిన ఫీజు చెల్లింపు పూర్తి షెడ్యూల్ ఇదే:

ఆలస్య రుసుము లేకుండా:

ఆలస్య రుసుము లేకుండా:విద్యార్థులు హెడ్‌మాస్టర్‌కు ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ: నవంబర్ 26, 2026

హెడ్‌మాస్టర్లు సైబర్ ట్రెజరీ ద్వారా ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ: నవంబర్ 27

విద్యార్థుల వివరాలను డిఈఓకు ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు చివరి తేదీ: నవంబర్ 30

స్కూల్ వచీ=ను డీజిఈకు సమర్పించేందుకు చివరి తేదీ: డిసెంబర్ 14

రూ. 50 ఆలస్య రుసుముతో:

విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు గడువు: నవంబర్ 28 నుంచి డిసెంబర్ 8 వరకు

హెడ్‌మాస్టర్లు ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ: డిసెంబర్ 9

విద్యార్థుల వివరాల సమర్పణకు చివరి తేదీ: డిసెంబర్ 11

రూ. 200 ఆలస్య రుసుముతో:

విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు గడువు: డిసెంబర్ 10 నుంచి 21 వరకు

హెడ్‌మాస్టర్లు ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ: డిసెంబర్ 22

డిఈఓకు వివరాలు సమర్పించేందుకు చివరి తేదీ: డిసెంబర్ 28

స్కూల్ eNR సమర్పణకు చివరి తేదీ: జనవరి 7, 2027

రూ. 500 ఆలస్య రుసుముతో:

విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు గడువు: డిసెంబర్ 23 నుంచి జనవరి 4, 2027 వరకు

హెడ్‌మాస్టర్లు ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ: జనవరి 5, 2027

డిఈఓ కు వివరాలు సమర్పించేందుకు చివరి తేదీ: జనవరి 6, 2027 వరకు.

'ఓట్ చోర్' నినాదం..ఇటలీ నేతకు షాక్!



న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన "భారత్ సమ్మిట్" వివాదాలకు కేంద్రంగా మారింది. రాహుల్ గాంధీ హాజరైన ఈ సమావేశానికి పలువురు విదేశీ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. అయితే, ఈ సమావేశంలో ఇటలీ నాయకుడు గియాకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలు భారత్‌తో రాజకీయంగా తీవ్ర వివాదానికి కారమయ్యాయి. భారత అంతర్గత రాజకీయ వివాదాల్లో తలదూర్చారని, విదేశీ నేత చేసిన వ్యాఖ్యలు రాహుల్ గాంధీ నవ్వడం ఏంటని బీజేపీ ప్రశ్నిస్తోంది. ఫిలిబెక్ రాహుల్ గాంధీ నినాదమైన "ఓట్ చోర్.. గద్దీ ఛోడ్" అనే నినాదాన్ని ప్రస్తావించారు.

ఫిలిబెక్‌పై ఫిలిప్పీన్స్ ఆంక్షలు: అయితే, ఇటలీ నేత ఫిలిబెక్‌ను 2018లోనే ఫిలిప్పీన్స్ దేశం నుంచి బహిష్కరించింది. 2018 ఏప్రిల్‌లో ఓ రాజకీయ పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు గాయాకోమో ఫిలిబెక్ ఫిలిప్పీన్స్ వెళ్లారు. మక్టాన్ సెబు అంతర్జాతీయ విమానాశ్రయంలోనే అతడిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఆయన "చట్టవిరుద్ధ రాజకీయ కార్యకలాపాలకు" పాల్పడ్డారనే కారణంగా ఫిలిప్పీన్స్ ఇమ్మిగ్రేషన్ అధికారులు అతడిని బ్లాక్ లిస్ట్‌లో చేర్చారు. అదే రోజు ఆయనను తిరిగి వెనక్కి పంపించారు. 2017 అక్టోబర్‌లో ఫిలిబెక్ అంతర్జాతీయ మానవ హక్కుల మిషన్‌లో పాల్గొన్నాడు. ఆ సమయంలో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో దుతెర్తే చేపట్టిన డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాన్ని విమర్శించారు. ఆ తర్వాతే ఇతడిని ఆ దేశం బ్లాక్ లిస్ట్ చేసింది. విదేశీ సందర్శకులు మరో దేశ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడానికి అనుమతి లేదని ఫిలిప్పీన్స్ అధికారులు స్పష్టం చేశారు. ఈ చర్యను ఫిలిబిక్ కు చెందిన యూరోపియన్ సోషలిస్ట్ పార్టీ ఖండించింది.

భారత్‌లో వీసా నిబంధనల ఉల్లంఘన.. ఫిలిబెక్ హైదరాబాద్ పర్యటించడం, భారత అంతర్గత రాజకీయాల్లో వ్యాఖ్యలు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో విదేశీ నేతలు ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే అంశం తెరపైకి వచ్చింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఫిలిబెక్ ఈ-వీసా పోర్టల్ ద్వారా కాన్ఫరెన్స్ వీసాపై భారత్‌కు వచ్చాడు. ఆయన భారత అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం వీసా నిబంధనల్ని ఉల్లంఘించడమే అని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఎల్పీజీ వాడకంలో తెలంగాణ నంబర్ వన్!

మొదటి పేజీ తరువాయి

ఈ గణాంకాలతో నివేదికలో పరిశీలించిన రాష్ట్రాలన్నింటిలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది.

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలను కలిపి చూస్తే ఎల్పీజీ వినియోగం 84.4 శాతంగా నమోదైంది. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 95.3 శాతం ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో 73 శాతంగా ఉంది. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో వంట గ్యాస్ వినియోగం ఎక్కువగా ఉంటుందనే అంచనాలకు భిన్నంగా తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోనే అధిక వినియోగం నమోదవడం విశేషం. గ్రామీణ ఎల్పీజీ వినియోగంలో తెలంగాణ తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది.

తెలంగాణలో 95.3 శాతం.. ఆంధ్రప్రదేశ్ 86.9 శాతం, పంజాబ్ 84.1 శాతం, కర్ణాటక 81.5 శాతం, తమిళనాడు 81.4 శాతాలతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో గ్రామీణ ఎల్పీజీ వినియోగం చాలా తక్కువగా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో 15.3 శాతం, ఒడిశాలో 16.8 శాతం, జార్ఖండ్‌లో 17.2 శాతం, రాజస్థాన్‌లో 22.9 శాతంగా నమోదైంది. ఈ గణాంకాలు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్వచ్ఛమైన వంట ఇంధన వినియోగంలో ఉన్న వ్యత్యాసాలను వెల్లడిస్తున్నాయి. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో ఎల్పీజీ వినియోగం గణనీయంగా పెరగడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలు కూడా దోహదపడ్డాయని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

గత 10 ఏళ్ల నుంచి 15 ఏళ్లలో ఎల్పీజీ అందుబాటును పెంచేందుకు చేపట్టిన వివిధ కార్యక్రమాల ద్వారా రాష్ట్ర జనాభాలో దాదాపు సగం మందికి ప్రయోజనం చేకూరిందని తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 1.3 కోట్ల మంది యాక్టివ్ ఎల్పీజీ వినియోగదారులు ఉన్నారని పేర్కొన్నారు. వీరిలో రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా సుమారు 40 లక్షల మందికి.. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా మరో 10 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు అందినట్లు ఆయన వెల్లడించారు. అలాగే సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా మరో 5 లక్షల మందికి ఎల్పీజీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.

ఎస్‌బీఐ రీసెర్చ్ ఈ నివేదికను నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) నిర్వహించిన హౌస్‌హోల్డ్ కన్సంప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే (హెచ్‌సీఈఎస్) 2023-24 ఆధారంగా రూపొందించింది. 2023 ఆగస్ట్ నుంచి 2024 జూలై వరకు ఈ సర్వే నిర్వహించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన మొత్తం 2,61,953 కుటుంబాల నుంచి వివరాలు సేకరించారు. ఈ గణాంకాలను విశ్లేషించిన అనంతరం గ్రామీణ ఎల్పీజీ వినియోగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ వెల్లడించింది. గ్రామీణ కుటుంబాలకు వంట గ్యాస్ అందుబాటు పెరిగిన తీరును ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

ఓటర్లకు ఈసీ భారీ ఊరట!

మొదటి పేజీ తరువాయి

గతంలో నమోదైన ఓటరు ఫారం-6 సమర్పించడం ద్వారా తప్పుడు డిక్లరేషన్ ఇచ్చినట్లు అవుతుందన్న భయం అర్థరహితమని ఆ కేసులో హైకోర్టు స్పష్టం చేసినట్లు గుర్తుచేసింది. ఈ స్పష్టతను స్థానిక భాషల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులను ఆదేశించినట్లు తెలిపింది.

ఏఎస్‌డీడీ ఓటర్లకు మరో అవకాశం

ముసాయిదా ఓటర్ల జాబితాలో 'గైర్హాజరు, బదిలీ, మరణించిన, నకిలీ' కేటగిరీ కింద పేర్లు తొలగించబడిన ఓటర్లు, తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లను చేర్చుకోవడానికి మరో అవకాశం కల్పించాలని ఈసీ ఆదేశించింది. ఈ మేరకు నవంబర్ 6న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, నాగాలాండ్ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు సుప్రీంకోర్టుకు వివరించింది. అలాగే తన అంతర్గత పని విభజనపై స్పష్టతనిస్తూ.. ఎన్నికల సంఘంలోని ఐటీ/ఐసీటీ విభాగం ఎల్లప్పుడూ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ (సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్) పర్యవేక్షణలోనే కొనసాగుతోందని అఫిడవిట్‌లో ఈసీ పేర్కొంది.

డిస్కంల్లో డిజిటల్ విప్లవం!

మొదటి పేజీ తరువాయి

కొత్త పోస్టులు.. నిపుణుల నియామకం

ప్రస్తుతం డిస్కంలలో ఉన్న ఐటీ విభాగాలు కేవలం ప్రాథమిక నిర్వహణ పనులకే పరిమితమయ్యాయని, రాబోయే ఏఐ, స్మార్ట్ గ్రిడ్, ఆటోమేషన్ వ్యవస్థలను నడిపించే సామర్థ్యం ప్రస్తుత సిబ్బందికి లేదని సీఈఏ నివేదిక కుండబద్దలు కొట్టింది. ఈ అంతరాన్ని భర్తీచేసేందుకు ఐసీటీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల నుంచి నిపుణులను నేరుగా నియమించుకోవాలని సూచించింది. ముఖ్యంగా డేటా ఇంజినీర్లు, సైబర్ అనలిస్టులు, ఏడీఎంఎస్, స్కాడా ఇంజినీర్లు, జీఐఎస్ నిపుణులు, డిజిటల్ ట్విన్ ఇంజినీర్లు, ఏఐ/ఎంఎల్ అనలిస్టులతో కూడిన ప్రత్యేక డిజిటల్ క్యాడర్‌ను రూపొందించాలని నిర్దేశించింది. వీరికి ప్రత్యేక విద్యార్హతలు, కెరీర్ ప్రోగ్రెషన్ విధానాలను ఖరారు చేయాలని పేర్కొంది.

ప్రమాదాలకు చెక్

విద్యుత్ సబ్‌స్టేషన్లు, హై-వోల్టేజ్ లైన్ల వద్ద మరమ్మతులు చేసేటప్పుడు జరిగే ప్రమాదాలను నివారించేందుకు వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), అసిస్టెడ్ రియాలిటీ వంటి అత్యాధునిక సాంకేతికతలను వినియోగించనున్నారు. కొత్తగా చేరే సిబ్బందికి, లైన్‌మెన్లకు నేరుగా లైవ్ వైర్ల వద్ద కాకుండా వీఆర్ హెడ్‌సెట్ల ద్వారా కృత్రిమ వాతావరణంలో ప్రమాదకర పనులపై శిక్షణ ఇస్తారు. అలాగే క్షేత్రస్థాయిలో మరమ్మతులు చేసేటప్పుడు ఉద్యోగులు చేతులు వాడాల్సిన అవసరం లేకుండా (హ్యాండ్స్-ఫ్రీ) స్మార్ట్ గ్లాసెస్ ద్వారా కంట్రోల్ రూమ్‌లోని నిపుణుల సూచనలు పొందేలా 'అసిస్టెడ్ రియాలిటీ'ని విస్తృతంగా విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరును సమూలంగా మార్చేందుకు సిద్ధమవుతున్న కేంద్ర విద్యుత్ శాఖ.. సంస్థల్లోని ఉద్యోగుల విభాగాల్లోనూ భారీ ప్రక్షాళనకు తెరలేపింది.టీ' పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తారు.

మూడేళ్లలో సమూల మార్పులు

డిస్కంలలో సాంకేతిక మార్పులను ఉద్యోగులు సులువుగా అందిపుచ్చుకునేందుకు 'చేంజ్ మేనేజ్‌మెంట్' పేరుతో నాలుగు దశల కార్యాచరణను సీఈఏ ప్రకటించింది. మొదటి ఆరు నెలల్లోనే ఉద్యోగులందరికీ ప్రాథమిక డిజిటల్ అక్షరాస్యత శిక్షణ పూర్తి చేయాలి. 18 నెలల్లోగా కొత్త డిజిటల్ క్యాడర్ నియామకాలు చేపట్టి, ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులతో (ఓఈఎం) కలిసి ఉద్యోగులకు సర్టిఫికేషన్ కోర్సులు అందించాలని సూచించింది. మూడేళ్ల తర్వాత ప్రతి డిస్కంలో ప్రత్యేకంగా 'డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫీస్' (డీటీఓ) ఏర్పాటు చేసి, అంతర్గత నిపుణులతో నిరంతర శిక్షణ కేంద్రాలు నడపాలని నివేదిక స్పష్టం చేసింది.

కుల్గాం దాడి సూత్రధారి హతం!



న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): కుల్గాం ఉగ్రదాడికి భద్రతా బలగాలు ప్రతీకారం తీర్చుకున్నాయి. సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై దాడి ఘటనలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, లష్కరే తోయిబాకు చెందిన లతీఫ్ భట్ హతమయ్యాడు. కుల్గాం జిల్లాలోని లారూ ప్రాంతంలో భద్రతా దళాలు చేపట్టిన గాలింపు చర్యల సందర్భంగా ఈ ఎదురుకాల్పులు జరిగాయి. సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లతీఫ్‌తో సహా ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. జమ్మూ కాశ్మీర్‌లోని కుల్గాంలో సీఆర్పీఎఫ్ భద్రతా పోస్టుపై నవంబర్ 11న ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. అప్పటి నుంచి ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు తీవ్రంగా గాలిస్తున్నాయి.

లతీఫ్ భట్ ఎవరు.?

లతీఫ్ భట్ కుల్గాం జిల్లాకు చెందిన వ్యక్తి. కళాశాల చదువును మానేసి, ఆ తర్వాత స్థానికంగా కార్పెంటర్ పనిచేశాడు. 2025 నవంబర్‌లో అకస్మాత్తుగా ఆచూకీ లేకుండా పోయాడు. ఆ తర్వాత లష్కరే తోయిబాలో చేరినట్లు తెలిసింది. ఈ ఉగ్ర సంస్థకు రెసిస్టెన్స్ ఫ్రంట్, కాశ్మీర్ రివల్యూషనరీ ఆర్మీ వంటి ఉగ్ర గ్రూపులు ప్రాక్సీలుగా పనిచేస్తున్నాయి. లతీఫ్ దక్షిణ కాశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉగ్రవాద కార్యకలాపాలు చేస్తున్నట్లు భద్రతా బలగాలు భావిస్తున్నాయి.

జూలై 2026లో షోపియాన్‌లో జరిగిన భద్రతా ఆపరేషన్ నుంచి తృటిలో తప్పించుకున్నాడు. ఆ సమయంలో లతీఫ్‌కు జాకీర్ అహ్మద్ ఘనీతో సంబంధాలు ఉన్నాయి. ఈ ఘనీని జూలై 2026లో భద్రతా బలగాలు హతమార్చాయి.

6 రోజులుగా గాలింపు, 600 అనుమానితుల విచారణ..

నవంబర్ 11న కుల్గాం సీఆర్పీఎఫ్ క్యాంపుపై దాడి తర్వాత భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రభావిత ప్రాంతాలను దిగ్బంధించి, ఉగ్రవాదుల కోసం వేట కొనసాగిస్తున్నారు. అనుమానితుల కదలికల్ని పసిగట్టడానికి, ఉగ్ర స్థావరాలు గుర్తించడానికి, ఆయుధ నిల్వల్ని గుర్తించడానికి డ్రోన్లు, జాగిలాలు, మెటల్ డిటెక్టర్లతో గాలింపు చేపట్టారు. 600 మందికి పైగా అనుమానితుల్ని విచారించారు.

ఘనంగా ముగిసిన ఛఠ్ పూజ!



న్యూస్ డెస్క్, 16 నవంబర్ (ఇది కద నిజం): దేశవ్యాప్తంగా నాలుగు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగిన 'ఛఠ్ పూజ' (ఛఠీ మైయా ఆరాధన) మహాపర్వం సోమవారంతో ఘనంగా ముగిసింది. ఈ నేపథ్యంలో ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. నవంబర్ 13న 'నహాయ్-ఖాయ్'తో మొదలైన ఈ ఉత్సవాల్లో భాగంగా, భక్తులు ఆదివారం సాయంత్రం అస్తమించే సూర్యుడికి 'సంధ్యా అర్ఘ్యం' సమర్పించారు. చివరి రోజైన సోమవారం వేకువజామునే బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీలోని గంగా, యమునా నదీ తీరాలు, చెరువుల వద్దకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు నీటిలో నిలబడి ఉదయించే సూర్యభగవానుడికి 'ఉషా అర్ఘ్యం' సమర్పించారు.

అనంతరం 'పారణ' కార్యక్రమంతో తమ కఠినమైన 36 గంటల నిర్జల ఉపవాస దీక్షలను భక్తులు విరమించారు. తమ పిల్లల ఆయురారోగ్యాలు, కుటుంబ శ్రేయస్సు కోసం సూర్యదేవుడు, ఛఠీ మైయాకు ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి తీర్థప్రసాదాలు పంచుకున్నారు. లక్షలాది మంది భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి నదీ తీరాలకు వస్తారనే సమాచారంతో స్థానిక ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశాయి. ముఖ్యంగా ఢిల్లీ నగరంలో యమునా నదిని శుభ్రం చేయడంతో పాటు ప్రత్యేక సరస్సులను సైతం ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ ఛఠ్ పూజ కార్యక్రమాన్ని ముగించుకున్నారు.

సర్ పై సుప్రీంకోర్టుకు రాహుల్!

మొదటి పేజీ తరువాయి

అసలు వివాదం ఇదే..

మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ప్రమేయం, ఆమోదం లేకుండానే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషన్ యొక్క ఉమ్మడి అధికారాలను వినియోగించారా అనే అంశాన్ని పిటిషనర్లు ప్రశ్నించారు. కీలకమైన అధికారిక ఫైళ్లు, సమావేశపు మినిట్స్, రికార్డులను దాచిపెడుతూ, ఎన్నికల సంఘం కేవలం నిరాధారమైన వాదనలతో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సర్ నిర్వహించేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆగస్టు 2025లో వచ్చిన సమాచార హక్కు చట్టం సమాధానాన్ని ఇందులో ప్రస్తావించారు. సుప్రీంకోర్టు నిబంధనలు 2013లోని ఆర్డర్ V రూల్ 1, ఆర్డర్ XXXVIII రూల్ 11(9), ఆర్డర్ LV రూల్ 6 ప్రకారం, జస్టిస్ కేఎన్ పుట్టస్వామి Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ ఈ అనుమతి కోరారు.

48 అధికారిక లిఖితపూర్వక ప్రశ్నలు..

అయితే, ఫిబ్రవరి 2025 నుంచి అక్టోబర్ 2026 మధ్య కాలంలో సర్, ECINET, ఫారం 6, కోర్టు అప్పీళ్లపై ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి ఏవైనా లిఖితపూర్వక అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలు నమోదు చేశారా అనే వివరాలను వెల్లడించాలని పిటిషనర్లు కోర్టును కోరారు. ఓటర్ల జాబితా డేటాబేస్‌లోకి ప్రైవేట్ కాంట్రాక్టర్లు, వెండర్లకు మార్పులు చేసే అవకాశం ఉందా, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల ఉత్తర్వులు లేకుండానే భారీగా ఓట్ల తొలగింపు జరిగిందా, యాక్సెస్ ఆడిట్ ప్రతిపాదనలపై తీసుకున్న చర్యలేమిటో ఈసీఐ డైరెక్టర్ జనరల్ స్పష్టం చేయాలని కోరారు. అదేవిధంగా ఆన్‌లైన్ ఫారం-6లో కొత్త డిక్లరేషన్ చేర్చడానికి ఎవరు అనుమతించారు, డ్రాఫ్ట్, తుది జాబితాల నుంచి తొలగించబడిన ఓటర్ల రాష్ట్రాల వారీ డేటా, అలాగే అత్యవసర ఈసీఐ ఆమోదాలను వాట్సాప్, వ్యక్తిగత ఈ-మెయిల్ ద్వారా పొందారా అనే వివరాలను పిటిషనర్లు ధర్మాసనాన్ని అడిగారు.

తెలంగాణలో పింఛన్ల పండుగ!

మొదటి పేజీ తరువాయి

ఐదు కేటగిరీల్లో 4.63 లక్షల మందికి పింఛన్లు

రాష్ట్రంలోని పేదలు, మహిళలు, దివ్యాంగులు, సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ ఈ కొత్త పింఛన్లను మంజూరు చేసింది. మొత్తం 5 కేటగిరీల్లో లబ్ధిదారులను ఎంపిక చేసింది. వితంతువులు 2,77,894 మంది.. దివ్యాంగులు 1,00,224 మంది, ఒంటరి మహిళలు 53,844 మంది, గీత కార్మికులు 27,444 మంది, చేనేత కార్మికులు 4,451 మంది ఉన్నారు. మొత్తం కలిపి 4,63,857 మంది లబ్ధిదారులు ఈనెల నుంచి కొత్తగా పెన్షన్లు అందుకోనున్నారు.

కొత్తగా మంజూరైన పింఛన్లలో వితంతువుల సంఖ్య అత్యధికంగా ఉంది. ఆ తర్వాత దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఉన్నారు. గీత, చేనేత కార్మికులకు కూడా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది. కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు నవంబర్ 19వ తేదీన తొలి నెల పింఛన్ సొమ్మును నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నగదు బదిలీ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. నగదు బదిలీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు సమాచారం. అవసరమైన అదనపు నిధులను కూడా విడుదల చేసింది.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తోంది. లబ్ధిదారులకు ఎలాంటి

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

మంగళవారం 17-11-2026

కార్తీక సోమవారం సందర్భంగా యాదగిరిగుట్ట దేవస్థానంలో ప్రత్యేక కార్యక్రమాలు

-250 మంది ముత్తయిదులకు వాయనాలు పంపిణీ

-రామలింగేశ్వర ఆలయంలో కార్తీక దీపారాధన



ఇది కద నిజం,యాదగిరిగుట్ట: పవిత్ర కార్తీక మాసం, కార్తీక సోమవారం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం పలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 6:30 గంటల నుండి దేవస్థానం ప్రాంగణంలోని అఖండ దీపం వద్ద 250 మంది ముత్తయిదులకు దేవస్థానం తరఫున వాయనాలు పంపిణీ చేశారు. ఈ వాయనాల్లో పసుపు, కుంకుమ, గాజులతో పాటు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వాయనాలు, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించి సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా కార్తీక సోమవారం పురస్కరించుకొని దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్వతవర్ధని సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో కార్తీక దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. భవానీ శంకర్ పాల్గొని కార్తీక దీపాన్ని వెలిగించారు. వేదమంత్రోచ్చారణల నడుమ కార్తీక దీపం యొక్క ఆధ్యాత్మిక విశిష్టతను తెలియజేస్తూ దీపారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసంలో దీపారాధనకు ఎంతో విశిష్టత ఉందని, దీపజ్యోతి దైవానుగ్రహానికి, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త భాస్కర్ నరసింహమూర్తి , మహిళా భక్తులు, ఇతర భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

జుక్కల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

బాధితులకు తక్షణ న్యాయం అందించాలి

నేరాల నియంత్రణకు గస్తీని ముమ్మరం చేయాలి



ఇది కద నిజం ,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, నవంబర్ 16: జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర జుక్కల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, నేరాల నమోదు విధానం, సాంకేతిక వ్యవస్థ పనితీరు, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి ఏవైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధులను ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని, విధి నిర్వహణతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతిరోజూ నిర్వహించే విధుల సమీక్షలో సిబ్బందికి నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలపై తగిన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నేరాల నియంత్రణకు గ్రామాల్లో గస్తీ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని తెలిపారు. పోలీసు వాహనాలతో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేస్తూ మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ దిశానిర్దేశం చేశారు.

ఈ తనిఖీలో బాన్సువాడ డీఎస్పీ విట్టల్ రెడ్డి, బిచ్కుంద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, జుక్కల్ ఎస్ఐ మురళి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన 802 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ



ఇది కద నిజం:యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని దినేష్ గార్డెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఆలేరు మండలం మరియు ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన 802 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తోందని, సమాజంలోని పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మరియు ఇతర అర్హులైన వర్గాలకు అండగా నిలవడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. నూతనంగా పెన్షన్లు మంజూరైన 802 మంది లబ్ధిదారులకు ఈ మంజూరు పత్రాలు అందించడం సంతోషకరమైన విషయమని, పెన్షన్ ద్వారా లబ్ధిదారులకు ప్రతి నెలా ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మరియు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ఈ పెన్షన్లు ఎంతో తోడ్పాటునందిస్తాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమం మరియు అభివృద్ధిని సమాంతరంగా కొనసాగిస్తున్న ప్రజాపాలన ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందకుండా ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భూలక్ష్మమ్మ, పాపమ్మ ఆలయాల ప్రారంభోత్సవం



ఇది కద నిజం,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నవంబర్ 16: పిట్లం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో భూలక్ష్మమ్మ, పాపమ్మ నాగమ్మ ఆలయాల ప్రారంభోత్సవం సోమవారం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, క్రతువులు నిర్వహించి అమ్మవార్ల ఆలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. దీంతో శాంతినగర్ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. సర్పంచ్ శేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాబు దొర, జగదీశ్, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.



స్వర్ణగిరి క్షేత్రంలో ఘనంగా శ్రవణ నక్షత్రం వేడుకలు, రథోత్సవ సేవ



ఇది కద నిజం :శ్రీ పరాభవ నామ సంవత్సరం, కార్తీక మాసం శుక్ల పక్ష సప్తమి, సోమవారం (నవంబర్ 16) నాడు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్ర వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రాతఃకాలంలో అర్చక స్వాములు స్వామివారికి విశేషంగా సుప్రభాత సేవను నిర్వహించి, అనంతరం భక్తులకు గోపృష్ట దర్శనం కల్పించారు. ఉదయం 5:45 గంటలకు వేదమంత్రోచ్చారణల నడుమ బంగారు బావి నుండి సువర్ణ బిందె తీర్థమును తీసుకువచ్చి నిత్యారాధనలు పూర్తి చేశారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా ఉదయం 6:30 గంటలకు భక్తులు కొండ కింద ఉన్న శ్రీవారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసి, గోవింద నామస్మరణతో పెద్ద ఎత్తున గిరి ప్రదక్షిణ నిర్వహించారు. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు మంచినీరు, మజ్జిగ అందించి, శీఘ్ర దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటలకు స్వామివారిని మణిమయ శోభిత స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలలతో అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. కార్తీక మాస ఉత్సవాలలో భాగంగా అష్టలక్ష్మి మంటపంలో కార్తీక దామోదర హవనం, వైభవ మంటపంలో సత్యనారాయణ వ్రతాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పట్టు పీతాంబరధారియైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తిలకించి ఆనంద పరవశులయ్యారు. ఆలయంలోని నిత్యాన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 3,000 మందికి పైగా భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం సంధ్యా వేళ ఆలయ ధ్వజస్తంభమునకు భక్తిశ్రద్ధలతో మోక్ష నారాయణ దీపాన్ని వెలిగించారు. అనంతరం రాత్రి 6:30 గంటలకు స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని రథోత్సవ సేవను కన్నుల పండువగా నిర్వహించారు. రథంపై శోభాయమానంగా కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మేళతాళాలు, మృదంగ మంగళ ధ్వనులు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య మాడవీధులలో ఘనంగా ఊరేగించారు.



ఓయూ హాస్టళ్లకు నీరు, విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని విద్యార్థుల మౌన దీక్ష



ఇది కద నిజం :ఉస్మానియా యూనివర్సిటీలోని ఈ-1, ఈ-2 మరియు డి హాస్టళ్లకు నీరు, విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు జంగయ్య, అశోక్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. హాస్టళ్లను కూల్చివేయాలన్న ప్రభుత్వ, అధికారుల విధానాలను వ్యతిరేకిస్తూ సోమవారం ఓయూ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట విద్యార్థులు మౌన దీక్షకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ లా కాలేజీకి సంబంధించిన ఈ-1, ఈ-2, డీ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు వీసీ, యూనివర్సిటీ అధికారులు కావాలనే కరెంట్, వాటర్ సప్లై నిలిపివేశారని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేక కష్టపడి చదువుకుంటున్న నిరుద్యోగ విద్యార్థులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, వారిని ఇళ్లకు పంపించే కుట్రలో భాగంగానే హాస్టళ్లను మూసివేయాలని చూస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై విద్యార్థి నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చి ఏడాది గడుస్తున్నా అప్పుడు హామీ ఇచ్చిన రూ. 1000 కోట్ల నిధుల్లో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని వారు ఆరోపించారు. విద్యార్థులను, నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని విమర్శిస్తూ, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి స్పందించాల్సిన అధికారులు, పోలీసులను అడ్డుపెట్టి విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి హాస్టళ్లకు నీరు, విద్యుత్ సరఫరాతో పాటు మెస్‌లను పునరుద్ధరించాలని, అలాగే టీచింగ్, నాన్-టీచింగ్ మరియు ఇతర ఉద్యోగ నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట మౌన దీక్ష నిర్వహిస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ ఆందోళనలో పాల్గొన్న బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్యతో పాటు అశోక్, సతీష్, ప్రదీప్, రమేష్, శ్రీశైలం, చరణ్, శ్రీనివాసరెడ్డి, అఫ్రిది తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను నెరవేర్చాలని అరెస్టయిన విద్యార్థి నేతలు కోరారు.

ఎల్లంపేట లో అయ్యప్ప ఇరిముడి మహోత్సవం

రవిచంద్ర ఇరుముడి కి హాజరైన మాజీ మంత్రి రెడ్యా నాయక్



మరిపెడ, 16 నవంబర్ (ఇది కద నిజం): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామం లోని బ్రవరాంభిక మల్లికార్జున ఆలయం సోమవారం అయ్యప్ప భక్తుల ఇరుముడి మహోత్సవం నేత్రపర్వం గా సాగింది. జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు డీఎస్ రవిచంద్ర కార్తీక మాస మండల పూజ పూర్తి చేసుకుని శబరి యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరుముడి మహోత్సవం అయ్యప్ప శరణు ఘోష మధ్య సందడి గా సాగింది. మహోత్సవంలో మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎల్లంపేట సర్పంచ్ గండి రాధమ్మ , గండి మహేష్ , తాళ్లపల్లి శ్రీను, తాళ్లపల్లి రఘు , గండి పరమేష్ ,గండి భార్గవ్ ప్రతాప్ రెడ్డి, గండి పుల్లయ్య , గండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా ఉల్లేపల్లి శివాలయ కార్తీక పూజలు

పంచామృతాభిషేకం చేసిన అచ్యుత రావు దంపతులు.



మరిపెడ, 16 నవంబర్ (ఇది కద నిజం): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లేపల్లి శివారులో ఉన్న సుప్రసిద్ధ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వయంభువు ఆలయంలో సోమవారం కార్తీక మాసం పురస్కరించుకొని ఆలయ అనువంశిక నిర్వాహకులు రామడుగు అచ్యుతరావు దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు జరిగాయి. అర్చకులు రుద్ర నమక చమకాలతో కూడిన పంచామృతాభిషేకం నిర్వహించారు ఈ సందర్భంగా చేసిన శివ అభిషేకం కార్యక్రమాలు నేత్రపర్వంగా సాగై అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసంలో చేసే శివారాధన పూజ ధ్యానం విశేష ఫలితాలు ఇస్తాయని అర్చకులు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో శ్రీరంగం శ్రీనివాస్ దంపతులు, మంగీలాల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ముఖాల్లో చిరునవ్వులే లక్ష్యం.. చేయూత పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం

సభా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి, కలెక్టర్ సత్య శారద



గీసుకొండ, 16 నవంబర్ (ఇది కద నిజం): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హుల గడపకు చేరినప్పుడే ప్రజాపాలనకు నిజమైన సార్థకత చేకూరుతుంది అనే లక్ష్యంతో నూతన చేయూత ఆసరా పెన్షన్ల పంపిణీకి అధికారులు సన్నద్ధమవుతున్నారు.బుధవారం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పైలాన్ ప్రాంతంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా నూతన పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో సోమవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.వేదిక, తాగునీరు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, లబ్ధిదారులకు అవసరమైన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో జడ్పీ సీఈఓ వసంత, గీసుగొండ, సంగెం మండల తహసీల్దార్లు రియాజుద్దీన్, రాజ్‌కుమార్, ఎంపీడీవో రమేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తొలి తెలంగాణ ఉద్యమకారుడు కూతురు వీరన్నకు ఘన నివాళి



ఖమ్మం, 16 నవంబర్ (ఇది కద నిజం): ఇటీవల మృతి చెందిన తొలి తెలంగాణ ఉద్యమకారుడు కూతురు వీరన్న సంతాప సభను 1969 తొలి తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో బోనకల్ క్రాస్ రోడ్‌లో నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా 1969 తొలి తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కూతురు కృష్ణమూర్తి మాట్లాడుతూ, వీరన్న సంఘంలో వైస్ ప్రెసిడెంట్‌గా

12 సంవత్సరాల పాటు సేవలందించారని, ఉద్యమకారుల హక్కుల కోసం ఆయన నాయకత్వంలో ఎన్నో అలుపెరుగని పోరాటాలు చేశామని గుర్తుచేసుకున్నారు . ఆయన మృతి ఉద్యమకారుల సంఘానికి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు . ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు జువ్వనపోయిన లింగయ్య , సోందు సాహెబ్, నెల్లె లక్ష్మీనారాయణ, చేరువు నరసింహారావు, కూరపాటి కృష్ణమూర్తి, వై.వి. వెంకటేశ్వరరావు, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 17-11-2026



సినిమా న్యూస్



15 ఏళ్ల ప్రయాణం ఎన్నో కలలు!



కోలీవుడ్ సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్.. సినీ పరిశ్రమలో విజయవంతంగా 15 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. సరిగ్గా 15 ఏళ్ల క్రితం ఇదే రోజు తన తొలి పాట ప్రేక్షకుల ముందుకు వచ్చిందని, అప్పటి నుంచి తన సంగీత ప్రయాణం ఎక్కడా ఆగకుండా నిరంతరంగా కొనసాగుతూనే ఉందని ఆయన గుర్తు చేసుకున్నారు. తమిళంతో పాటు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ వంటి పలు భాషల్లో సంగీతం అందించడం, అంతర్జాతీయ స్థాయి కళాకారులతో కలిసి పనిచేయడం, ఎన్నో భారీ చిత్రాల్లో భాగం కావడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని తెలిపారు. తాను చేసే ప్రతి పాట, ప్రతి మ్యూజికల్ కొలాబరేషన్, దక్కిన ప్రతి విజయం తనకు దేవుడు ఇచ్చిన ఒక గొప్ప వరమని ఆయన పేర్కొన్నారు. అలాగే 2026 సంవత్సరంలో ఎల్ఐకే, జననాయగన్, డీసీ, ది ప్యారడైజ్, జైలర్-2 వంటి క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఈ ఏడాది తన కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకంగా నిలిచిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

తాను కొత్తగా ప్రారంభించిన 'అల్బుకెర్కి రికార్డ్స్' విశేషాలను పంచుకుంటూ.. తనకు ఇంతటి అద్భుతమైన గుర్తింపునిచ్చిన సంగీత పరిశ్రమకు తిరిగి ఏదైనా మంచి చేయాలనే ఉద్దేశంతోనే ఈ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. దీని ద్వారా కొత్త తరానికి చెందిన యువ సంగీత కళాకారులకు మంచి అవకాశాలు కల్పించి, వారిని ప్రోత్సహించాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ఇన్నాళ్ల తన ప్రయాణంలో తన పాటలను పదే పదే వింటూ, పాడుతూ, ప్రతి అడుగులోనూ వెన్నంటి నిలిచిన అభిమానులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 15 ఏళ్ల ప్రయాణం విజయవంతంగా పూర్తయినా, ఇంకా సాధించాల్సినవి, నెరవేర్చుకోవాల్సిన కలలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. అందరి ఆశీస్సులతో మళ్లీ స్టూడియోకు వెళ్లి కొత్త మ్యూజిక్ కంపోజ్ చేయడానికి వెళ్తున్నానని చెబుతూ.. ఇది కేవలం ఆరంభం మాత్రమే అని రాసుకొచ్చారు.



ఏలియన్ వేటకు అక్షయ్ రెడీ!

బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ హీరోగా కనిష్క్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ 'సముక్' . సన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై విపుల్ అమృత్‌లాల్ షా నిర్మిస్తున్న ఈ సినిమాతో దాదాపు దశాబ్దం తర్వాత అక్షయ్, విపుల్ షా మళ్లీ కలిసి పనిచేస్తున్నారు. భారత ప్రధానిని తీవ్రవాదుల ముప్పు నుంచి కాపాడే ఒక ఎలైట్ సెక్యూరిటీ ఆఫీసర్.. అదే సమయంలో ఒక ప్రమాదకరమైన గ్రహాంతర జీవిని ఎలా ఎదుర్కొన్నాడనే ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాలో రుక్మిణి మైత్రా, వినీత్ కుమార్ సింగ్, రజత్ కపూర్, బనితా సంధు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఇప్పటికే యూకేలో 80 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా రిలీజ్‌కు సిద్ధమైంది. తాజాగా, అక్షయ్ కుమార్ ట్విట్టర్ ద్వారా ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఈ ఏలియన్ థ్రిల్లర్ 2027, మే 28న థియేటర్లలో విడుదల కాబోతున్నట్లు తెలుపుతూ.. 'ఒక వేటగాడు.. ఒకే లక్ష్యం.. నియమాలు లేని పోరాటం' అంటూ షేర్ చేసిన అనౌన్స్‌మెంట్ టీజర్ ఉత్కంఠభరితంగా సాగింది. చిమ్మచీకటి అడవిలో భయంకరమైన వింత జీవి పంజా బయటకు రావడం, రాతి గుహలో ఆయుధంతో నిలబడి ఉన్న అక్షయ్ కుమార్ విజువల్స్ సినిమాపై అంచనాలను పెంచేశాయి.

కూతురి కల కోసం తండ్రి సాహసం!

తండ్రీకూతుళ్ల మధ్య ఉండే అనుబంధానికి, కన్నపేగు కోసం తండ్రి చేసే సాహసయాత్రకు అద్దం పడుతూ తెరకెక్కిన సరికొత్త సెంటిమెంటల్ ఎమోషనల్ డ్రామా 'డియర్ ఆస్ట్రోనాట్'. సౌమిత్, శ్రేయసి సేన్, కమల్ కామరాజు ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు కార్తీక్ భాగ్యరాజ దర్శకత్వం వహిస్తున్నారు. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు, నటుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో నటించడం విశేషం. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేలా మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు.



విడుదలైన ట్రైలర్‌ను పరిశీలిస్తే.. ఇదొక వినూత్న భావోద్వేగాలతో కూడిన కథాంశంతో రూపొందించబడినట్లు స్పష్టమవుతోంది. చిన్నతనంలోనే ఆస్ట్రోనాట్ (అంతరిక్ష యాత్రికురాలు) కావాలని కలలు కనే తన కూతురి ఆశయాన్ని నెరవేర్చడానికి ఒక తండ్రి పడే తపన, ఆయన చేసే పోరాటమే ఈ చిత్ర ప్రధాన కథాంశం. పిల్లల భవిష్యత్తు కోసం, వారి కళ్లలోని ఆనందం కోసం తల్లిదండ్రులు ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతారనే అంశాన్ని ఈ చిత్రంలో అత్యంత హృద్యంగా ఆవిష్కరించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. సౌమిత్, శ్రేయసి సేన్, కమల్ కామరాజుల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టించేలా ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు గౌతమ్ వాసుదేవ్ మేనన్ తనదైన శైలి నటనతో ఈ చిత్రానికి మరింత బలాన్ని చేకూర్చారు. కార్తీక్ భాగ్యరాజ టేకింగ్, విజువల్స్, నేపథ్య సంగీతం సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేస్తున్నాయి. సైన్స్ ఫిక్షన్ మరియు ఎమోషనల్ డ్రామా అంశాల కలయికగా వస్తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. నవంబర్ 20న థియేటర్లలో సందడి చేయనున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.

'లెగసీ' విడుదల వాయిదా



టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ వరుస సినిమాలతో బాక్సాఫీసును షేక్ చేయడానికి సిద్ధమవుతున్నారు. సాయి కిరణ్ రెడ్డి దైదా దర్శకత్వంలో ఆయన నటించిన ఇంటెన్స్ పొలిటికల్ యాక్షన్ డ్రామా 'లెగసీ'. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ సరసన ఏక్తా రాథోడ్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ ప్రముఖ నటుడు కేకే మీనన్, రావు రమేష్, సచిన్ ఖేడేకర్, మురళీ మోహన్, రాజా రవీంద్ర, రాజీవ్ కనకాల వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కలాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి, సాయి కిరణ్ రెడ్డి దైదా సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ గతంలో ప్రకటించారు. అయితే గత రోజులుగా ఈ సినిమా వాయిదా పడుతుందంటూ సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వైరల్ అయ్యాయి.

ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న విశ్వక్ సేన్ ఈ రూమర్లపై స్పందించి పూర్తి క్లారిటీ ఇచ్చారు. అనుకున్నట్లుగా డిసెంబర్ 4న 'లెగసీ' విడుదల కావడం లేదని, ఈ సినిమాను వచ్చే ఏడాదికి వాయిదా వేసినట్లు ఆయన స్పష్టం చేశారు. చిత్ర యూనిట్ అందరూ కలిసి చర్చించుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రేక్షకులపై అతి తక్కువ వ్యవధిలో ఇన్ని సినిమాలు రుద్ది భారం మోపకూడదని డిసైడ్ అయి వెనక్కి తగ్గామని ఆయన వెల్లడించారు. వెంట వెంటనే సినిమాలు రిలీజ్ చేస్తే కేవలం టైటిల్ లేదా సినిమా పేరు మాత్రమే మారుతుందని, కానీ ఆడియన్స్‌కు రీచ్ అయ్యేలా ప్రమోషన్స్ చేయాల్సిన బాధ్యత మాత్రం అలాగే ఉంటుందని విశ్వక్ చెప్పారు. ఇలా నెల రోజుల వ్యవధిలో మూడో సినిమాకు కూడా ప్రమోషన్స్ చేయడం వల్ల తాను పూర్తిగా 'జోన్ అవుట్' అయిపోతానని, ప్రేక్షకులకు కూడా అది బోర్ కొడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

కల కోసం కల్పన పోరాటం!



మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటించిన తెలుగు చిత్రం 'ఆకాశంలో ఓ తార'. పవన్ సాదినేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తోంది. శ్రుతి హాసన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, రుహాని శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా, వైజయంతీ మూవీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నవంబర్ 20న తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ఏవోటీ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఓ సాధారణ పల్లెటూరి అమ్మాయి ఆస్ట్రోనాట్ కావాలనే కలను ఎలా నెరవేర్చుకుంది?.. ఆ ప్రయాణంలో ఆమె ఎలాంటి సవాళ్లను ఎదుర్కొంది? అనే ఆసక్తికరమైన కథాంశంతో ట్రైలర్‌ను రూపొందించారు. కల్పన అనే అమ్మాయి తన లక్ష్యం కోసం చేసే పోరాటం, ఆమెకు ఎదురయ్యే అడ్డంకులు, ఆ ప్రయాణంలో కృష్ణ అందించే ప్రోత్సాహం ప్రధానంగా కనిపిస్తున్నాయి. 'కృష్ణ ఎప్పుడూ తన గురించే ఆలోచిస్తావా? మరి నీ గురించి ఆలోచించవా?' అనే సంభాషణతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. 'పది మంది నవ్వితే ఏంటి.. ఒక్కరు నమ్మితే చాలదా కృష్ణా' అనే డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

చిత్రబృందం ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేసింది. హృదయానికి హత్తుకునే సంభాషణలు, భావోద్వేగభరితమైన సన్నివేశాలు, మనసుకు హాయినిచ్చే నేపథ్య సంగీతం కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. కల్పన కల, దాన్ని సాధించేందుకు ఆమె చేసే ప్రయత్నాలు, ఎదురయ్యే కష్టాలు.. ఇలా ప్రతి అంశాన్ని దర్శకుడు పవన్ సాదినేని భావోద్వేగభరితంగా చూపించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఏవోటీ ట్రైలర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఓ అమ్మాయి కలను సాకారం చేసుకునే ప్రయాణాన్ని భావోద్వేగాలతో మేళవించి తెరకెక్కించిన ఈ చిత్రం వెండితెరపై ఎలాంటి రిసల్ట్ అందుకుంటుందో చూడాలి.